# సెకండ్ టెస్ట్



విమలారామం

ఈ వేళ ఆఫీసుకి కొంచెం ఆలశ్యంగా వచ్చింది జానకి.

ప్రక్క సీట్లో సునంద కనిపించలేదు. ఎదురుగా ఉన్న వెంకట్రావుని అడిగింది. ఆఫీసరుగారి గది వైపు చూపించి వ్యంగ్యంగా నవ్వాడతను.

మరికాసేపటికి బయటకువచ్చిన సునందని ఆ గదిలో ఉన్నవాళ్ళంతా కళ్ళింత చేసుకొని చూసారు, నొసలతో మాట్లాడుకున్నారు.

సునంద ముఖం ఎర్రగా కందిపోయింది. బుగ్గల మీద సొట్టలు పడేలా పెదవుల మీదకి నవ్వు త్రోసుకు వస్తోంది. "వచ్చావా?" అంది జానకిని చూస్తూ.

కనుబొమ ఎగరేసింది జానకి. "ఏమిటి విశేషం?"

"రా. కాంటీన్‌కి వెళ్లి మాట్లాడుకుందాం" అని ఆమె చెయ్యి పట్టుకొని బయిటకు నడిచింది సునంద.

కాంటీన్‌లో టీ త్రాగుతూ కూర్చున్నారిద్దరూ.

"ఊఁ! ఇక చెప్పు" అంది జానకి కుతూహలంగా.

"చెప్పటానికేముంది? అంతా నీకు తెల్సిందే!" అంది సునంద బిడియంగా.

"అదేమిటి? అంతసేపు ఆయనతో కబుర్లాడి.... ఏమీ లేదంటావు?"

"అదే.... అడిగారాయన-అభిప్రాయం చెప్పమని!"

"బాగుంది! ఇంకా అభిప్రాయాలు అడగటందగ్గరేనా ఉన్నది"

"సినిమాకి వెడదాం వస్తావా అంటే, అవుననో కాదనో టక్కున చెప్పచ్చు. ఇది అలాంటిది కాదోయి జానీ! ఇది పెళ్లి, తెలుసా" అంది సునంద బుంగమూతి పెడుతూ.

"ఆహా! తెల్సు.... ఇంత దూరం వచ్చాక ఇంకా ఆలోచన ఏమిటా అని అడుగుతున్నాను. నేనయితేనా, ఇలా నాన్చి వుండేదాన్ని కాను!"

సునంద నవ్వింది. "పోనీ అలాగని ఆయనతో చెప్పనా?"

"ఛ పో! నీ మీద మనస్సు పారేసుకున్న వాడితో నాకేం పని! అసలు బెట్టుకాకపోతే ఈ తాత్సారం ఎందుకు నీకు? ఆయనంతట ఆయన కదలేపినప్పుడు.... నువ్విలా మీనమేషాలు లెక్కపెడుతున్నావు కాని, ఈ చుట్టుప్రక్కల మైలు దూరంలో ఏ ఆడపిల్లనయినా అడుగు, ఆయన్ని చేసుకోనని అంటుందేమో! అదృష్టం కల్సి వస్తుంటే నీ

బుర్రలో అనుమానాలు పట్టుకున్నా యేమిటో-కర్మ!''

"అయితే, ఒప్పేసుకోమంటావు?''

"ఆ! బుద్ధిమంతురాల్లా. చెప్పిన మాట విను. అందంలో నీకు సరి జోడు. ఇంక హోదాకా.... మన ఆఫీసరు. నువ్వే ఆఫీసరు పెళ్ళాని వయినప్పుడు మేమికనుంచి నీ క్కూడా దాసోహమే కదా!''

"ఊ! వేళాకోళానికేంలే!''

"నిజం సునా! తన క్రింద పనిచేసేదానివని కూడా సంకోచించకుండా ఆయన పెళ్ళాడతామంటున్నారంటే, మనిషి చాలా మంచి వారనే అనుకోవాలి! ఆ తర్వాత ఉద్యోగం అవసరమయితే చేస్తావు. లేకపోతే లేదు!''

"లేదు లేదు. ఉద్యోగం మానను. తమ్ముడి చదువు పూర్తయ్యేవరకు నాకీ బాధ్యత తప్పదు. అందుకనే కదా అసలు పెళ్లికిన్నాళ్ళు వాయిదా వేసింది!''

"సరే, ఈ సంగతుల గురించి మీరిద్దరూ స్పష్టంగానే మాట్లాడుకున్నారు కదా! ఇంకా సందేహమేమిటి నీకు?''

"ఏమీ లేదు జానీ! ఏదో ఆవేశంలో తప్పటడుగు వేస్తున్నానేమో నని....''

"ఛ! ముసలి ఆలోచనలూ నువ్వూ!'' అంది జానకి విసుక్కుంటూ.

సునంద నవ్వింది. "సరే! నువ్వవునంటున్నది నే నెందుక్కాదనాలి! మధ్యాహ్నం ఆయనకి చెప్పేస్తాను!''

"అమ్మయ్య! నన్ను బ్రతికించిన దాని వవుతావు''

"అదేం! మధ్య నీకు లాభం ఏమిటి?''

"మన ఆఫీసులో చెవులు కొరుక్కునే వాళ్ళ పోరు పడలేకపోతున్నాన్నేను. ప్రోగ్రస్ ఎంత వరకు వచ్చిందని నన్నడుగుతున్నారు'' అంటూ పక్కున నవ్వింది జానకి.

సునంద ముఖం చిట్లించింది. "వాళ్ళ కింకేం పనుల్లే వనుకుంటాను!''

"మీరు మాత్రం ఏం తక్కువ తిన్నారు చెప్పు! ఆవేళ టాంక్ బండ్ మీద కబుర్లు చెప్పుకుంటూ కరుణాకరానికి కనిపించారు. సిన్మా హాల్లో ఆ పిసింద్రీ జోగారావు మిమ్మల్ని పలకరించకమానాడా?''

"చాల్లే నీ లిస్టూ నువ్వూను.''

"ఇకనుంచి అలా ఉడుక్కుంటూ వెళ్లకు. చక్కగా తాళి కట్టించుకొని చల్ మోహన రంగా

అంటూ. చెట్టాపట్టా వేసుకొని మరీ వెళ్ళు. ఇక రూమరు పోయి గ్లామరు వస్తుంది!"

సునంద నవ్వుతూ లేచింది.

"ఇక ఆపు నీ పురాణం-పద"

*                *

"మే ఐ కమిన్ సర్!" అంది సునంద నవ్వు దాచుకొంటూ.

కిరణ్ కుమార్ కొంటెగా నవ్వాడు. "ఇవన్నీ పెళ్ళయ్యే దాకానే! ఆ తర్వాత?"

లోపలికి వస్తూ అంది సునంద. "అప్పుడయినా ఎప్పుడయినా మీరు మా ఆఫీసరు.... నేను మీ క్రింద పనిచేసేదాన్ని...."

"ప్రస్తుతం మన మధ్య అవేం లేవు కాని.... రండి, వచ్చి కూర్చోండి!"

అతని చూపుల తూపులు తగిలి ఆమె బుగ్గ లెర్రవారాయి. సిగ్గుతో కను రెప్పలు బరువెక్కి వాలిపో యాయి. ఆమెకేదో స్వప్నావ స్థలో ఉన్నట్టుంది.

"అబ్బ! ఈ తపస్సు ఇలా సాగవల్సిందేనా?" అన్నాడు కిరణ్ కుమార్ గోముగా.

"మీరు చెప్పినదాన్ని గురించి ఆలోచించానండి!"

"ఊ! అలాగనకపోతే ఒప్పు కుంటున్నానని అనరాదా యేం?"

సునంద ఓసారి అతన్ని చూసి నవ్వింది.

ఆమె నోటివెంట ఆ మాట వినటానికి ఆతనాతృతగా ఎదురు చూస్తున్నాడు.

ఇంతలో స్వింగ్ డోర్ తెఱచు కొని లోపలికి వచ్చాడు ప్రకాశం.

కిరణ్ కుమార్ ముఖం చిట్లిం చాడు. "ఎస్! వాడ్డూ యూ వాంట్?"

ప్రకాశం లోపలికి రెండడు గులు వేసి సునంద వైపొకసారి చూసాడు. క్షణంపాటు తటపటా యించాడు. ఆమె బిడియంగా తల దించుకొంది.

"ఎందుకు వచ్చారో చెప్ప కుండా అలా నిలబడిపోయారే మిటి?" కిరణ్ కుమార్ కంఠం మళ్ళీ ఖంగ్‌మని మ్రోగింది.

"మీరేదో ఫైలు కావాలన్నా రుట. వెంకట్రావుగారు చెప్పారు"

"అవును. అది వెతికి తియ్య టానికి వాళ్ళకి అరగంట పట్టింది. మీరిలా ఇష్టం వచ్చినట్టు లేటుగా వస్తే ఎలాగ?"

"సైముకే బయలుదేరానండి. పాపం.... ఒక పదేళ్ళ పిల్లని స్కూటరొకటి గుద్దేసింది. ఆ పిల్లని హాస్పిటల్లో చేర్పించి వచ్చే సరికింత ఆలశ్యమయింది!"

"....నో నో! డోంట్ టెల్ మి ఆల్ దోజ్ కాక్ అండ్ బుల్ స్టోరీస్!"

"నో సర్! ఇది నిజం!"

"మీ నిజానిజాలతో నాకు పని లేదు. మీ వల్ల ఆఫీసులో ఇన్ కన్వీనియన్స్ కలిగింది. అది గుర్తుంచుకోండి. ఐ వాంట్ డిసిప్లిన్ అండ్ పంక్చువాలిటీ! దట్సాల్-యు కెన్ గో!"

సునందకి ఆ క్షణంలో కిరణ్ కుమార్ ముఖం అందంగా కనిపించలేదు! ఎబ్బెట్టుగా కనిపించింది. అతని ముందు కూర్చోటానికి ఎలాగో అనిపించింది. ఆమె ఛటుక్కున ప్రకాశం వైపు చూసింది. అతని ముఖం ఎర్రబడి వుంది. ఏదో కాగితం కిరణ్ కుమార్‌కి అందించాడతను.

"వాటీజ్ దట్?" కిరణ్ కుమార్ స్వరంలో కాఠిన్యం తగ్గలేదు.

"ఆలశ్యంగా వచ్చానుకదాండి! కేజువల్ లీవు లెటర్, హాఫ్ డేకి" అని చెప్పి గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు ప్రకాశం.

"డేమ్ లయ్యర్!" కిరణ్ కుమార్ పళ్ళు పటపటలాడించాడు.

సునంద దించిన తల యెత్తలేదు. ఇబ్బందిగా కుర్చీలో కదిలింది.

"క్రిటికల్ టైమ్‌లో వచ్చి మన మూడ్ పాడుచేసాడు. యూజ్‌లెస్ ఫెలో!" అన్నాడు కిరణ్ కుమార్ నవ్వుతెచ్చుకుంటూ.

సునంద మాట్లాడలేదు. దించిన తల యెత్తనూ లేదు.

మళ్ళీ అతనేదో అనేలోగా ఫోన్ మ్రోగింది. రిసీవర్ ఎత్తి అవతల ఎవరితోనో అతను మాట్లాడుతుంటే, చెప్పకుండానే గది బయటకు వచ్చేసింది సునంద.

*

"ఏమయింది? చెప్పేసావా?" అంది జానకి చిలిపిగా నవ్వుతూ.

"లేదు. చెప్పలేదు. ఇప్పుడు నన్నేం అడక్కు. సాయంత్రం మాట్లాడుదాం" అని అప్పటికా సంభాషణ ఆపు చేసింది సునంద. జానక్కి సాయంత్రందాకా సస్పెన్సు తప్పలేదు.

ఆఫీసు వదలటానికి ముందే "పద పోదాం" అంది సునంద.

"అప్పుడేనా?"

"అవును, ఐదు దాటితే ఆయన లోపలికి పిలిపిస్తారేమో!"

"మరి వెళ్ళవూ?"

"ఊహూ! ఈ పూట నాకు వెళ్ళాలని లేదు...."

"సరే పద"

పదినిమిషాలు ముందుగానే ఆఫీసు వదిలిపెట్టారిద్దరూ.

"ఏమయింది? నువ్వెందుకు చెప్పలేదు?" జానకి ఆతృతగా అడిగింది. మధ్యాహ్నం జరిగినదంతా చెప్పింది సునంద.

"బాగానే ఉంది. ఆ మాత్రానికేనా? ఆయనప్పుడప్పుడూ అలా ఫైర్ చేయటం మనం లీవు కావాలన్నప్పుడు ఏదో సాకు చెప్పటం మామూలే కదా! ప్రకాశంగారూ అంతే చేసుండచ్చు!" అని నవ్వింది జానకి.

సునంద ముఖం గంభీరంగా వుంది. "ఛ! అసహ్యంగా మాట్లాడకు.... నిజమేమిటో మనకేం తెల్సని?"

"అదిగో! ఆ ప్రకాశంగారే ఇట్రొస్తున్నారు. అడిగితే పోలా?"

"ఉహూ! ఏం బావుంటుంది?"

"తప్పేముంది?"

అంతలో ప్రకాశం వాళ్ళ దగ్గరికి వచ్చాడు.

జానకే అడిగింది. "మీరేం అనుకోపోతే.... ఒకటడగాలి."

అతని నవ్వులో నిండుతనం ఉంది. "దానికేం? అడగండి"

"....ఇవేళ ఎవరికో ఏక్సిడెంట్ అయిందని" అని నసిగింది జానకి.

"....అంటే అది నిజం అవునా కాదా అని. అంతేనాండీ?" అతని కంఠం గంభీరంగా ఉంది.

"అబ్బే. అదికాదండీ!" సునంద కంగారుగా అంది.

"చూడండీ! ఆ విషయంలో ఒకర్ని నమ్మించాల్సిన అవసరం నాకు లేదు. కాకపోతే, అనుమానంగా ఉన్నవాళ్లు ఎవరయినా సరే ఆయనతో సహా ఇప్పుడు నా వెంట రావచ్చు. నే నిప్పుడా పిల్లని చూద్దామనే హాస్పిటలుకి వెడుతున్నాను."

జానకి గబుక్కున అడిగింది. "ఎవరండీ ఆ పిల్ల?"

"ఏమో నాకు తెలియదు. స్పృహలేని స్థితిలో ఉంటే తీసుకు వెళ్ళి చేర్పించాను. చేతుల్లో ఉన్న పుస్తకాల్ని బట్టి ఎక్కడ చదువుతోందో తెల్సింది. ఆ స్కూలుకి వెళ్ళి హెడ్ మిస్ట్రెస్‌ని కల్సుకొని సంగతి చెప్పాను. ఈ పాటికి వాళ్ళవాళ్ళకి కబురెళ్ళి ఉంటుంది. ఎందుకయినా మంచిదని మళ్ళీ చూద్దామని వెడుతున్నాను. ఇదీ సంగతి. ఇదే చెపుదామని లోపలికి వెడితేపో పొమ్మన్నారాయన!" అని పేలవంగా నవ్వాడు ప్రకాశం.

సునంద తానేదో తప్పు చేసినంతగా సిగ్గు పడిపోయింది.

"పోన్లెండి... ఎవరేమనుకున్నా

నా మనస్సుకి మంచిదని తోచింది చేసాను. మరి శలవా!" అని వాళ్ళకి విష్ చేసి ప్రకాశం వెళ్ళిపోయాడు. జానకి తట్టి పిలిచేవరకు అతను వెళ్ళిన వైపే చూస్తూ నిలబడింది సునంద.

* *

గబగబ ఆఫీసులో అడుగు పెట్టిన సునందని చూసి, "మీ రాగానే అయ్యగారోసారి కనిపించమన్నారమ్మా!" అన్నాడు ప్యూను.

ఆ మాట వినిపించుకోకుండా జానకి దగ్గరకి దూసుకువెళ్లింది సునంద. ఆమె చెయ్యి పట్టుకొని, "రా! త్వరగా రా!" అంది.

జానకి ఆమె హడావిడి చూసి తెల్లబోయింది, "ఎక్కడకి?"

"ఎక్కడికో చెప్తేకాని రావా?" సునంద విసుక్కుంది.

"అదికాదోయ్! బయటకేనా? లేక ఇంకెక్కడికేనా వెళ్లాలాఅని!"

"బయటకే!"

"మరి ఆయన పిలిచారట."

"విన్నాను కాని ముందు పద"

"మరి అటెండెన్స్‌లో.... సంతకం పెట్టవా?"

"అవన్నీ నాకు తెల్సు. ముందు వస్తావా రావా!" ఆమె కంఠంలోని విసుగుదలకి జానకి ఆశ్చర్యపోయింది. వెంటనే లేచి బయలుదేరింది. కాంపౌండులో ఎవ్వరూ లేని చోటుకి చేరారిద్దరూ.

"నేనో నిర్ణయాని కొచ్చాను." సునంద ముఖంలో క్రితం రోజు చిలిపితనం లేదు. పరవశం లేదు. ఆ స్థానంలో గాంభీర్యం ఉంది. దృఢత్వం ఉంది.

"ఏమిటీ?" సునందనే కళ్ళప్పగించి చూస్తోంది జానకి.

"నిన్న ఆయనతో ఆ సంగతి చెప్పకపోవటం మంచిదేఅయింది."

"అదేం? ఏమయిందిప్పుడు?"

"నా అభిప్రాయం మార్చుకున్నాను."

తెల్లబోయింది జానకి. "ఇంత వరకు నీకు సందేహాలు మాత్రమే ఉన్నాయనుకున్నాను. ఇప్పుడు అభిప్రాయం మీద నిలకడతనం కూడా లేదన్నమాట!"

"అలా ఉండటం ఎంత మంచిదయిందో నీకేం తెల్సు!"

"నీగ్గాని మతిపోయిందా?"

"లేదు జానీ. మత్తు విడింది!"

"........."

"నిజం జానీ! ఇన్నాళ్లు ఆయనదెంతో విశాల హృదయం అని భ్రమ పడ్డాను. అదంతా ఒట్టి మాటల వరకే! నిన్న ప్రకాశంగారి విషయంలో ఆయన ప్రవర్తన చూసాక...."

జానకి పకపక నవ్వింది. "ఓస్! ఆ మాత్రం దానికేనా! ఆఫీసరన్నాక ఏవో అనటం, మనం పడటం క్రొత్తేముంది? మరీ సెన్సిటివ్‌గా ఆలోచించకు. ఇది చాలా చిన్న విషయం. నువ్వు ఓవర్నయిట్ అభిప్రాయం మార్చుకోవల్సినంత సీరియస్ మేటర్ కాదు."

సునంద తల అడ్డంగా తిప్పింది. "ఊహూఁ! నీకు తెలియదు. ఎదుటి మనిషి క్రిందవాడయినంతమాత్రాన కట్టుకథ చెప్పాడని ఆయన నిర్ణయించుకోవటం ఏం న్యాయం? కనీసం.... ప్రకాశంగారు చెప్పబోయిన మాటలయినా పూర్తిగా విని వుంటే ఆయనకి నిజం తెలిసేది. అంత మాత్రం ఓర్పు, మంచి మనసు లేని మనిషి.... రేపు నన్ను పెళ్ళాడాక నా బాధ్యతల్ని, బాధల్ని అర్థం చేసుకొంటారని ఎలా నమ్మను?"

"ఛ! కట్టుకొన్న పెళ్ళాన్ని బయటివాళ్ళలాగే చూస్తారేమిటి ఎవరయినా?"

"బయట వాళ్ళెవరో తెలియకుండానే అంత బాధ్యత నెత్తిన వేసుకున్నారే-ప్రకాశంగారు. అదే భార్య విషయంలో అయితే మరెంత శ్రద్ధ చూపిస్తారో, ఊహించు!"

జానకి చిత్రంగా చూసింది. "అంటే? ఆయనకన్న ఈయన నయమంటావు?

"అవును వెయ్యిరెట్లునయం!"

"సునా!" విభ్రాంతపోయింది జానకి.

"ఆఫీసర్ని వద్దని-కింద పని చేసే వాడి మీదకి దృష్టి మార్చుకున్నానంటుందేవిటీ మనిషి అనుకొంటున్నావు కదూ! మేడలోకి రమ్మంటే... మట్టింట్లోకి పోతానంటుందేమిటీ పిచ్చిది అనుకుంటున్నావు కదూ!"

"ఏమో నాకు తెలియదు. ఇదే నీ నిర్ణయమైతే తొందరపడుతున్నావని మాత్రం చెప్పగలను!"

"అవును. ఒక అమూల్య రత్నం చేజారిపోకూడదని తొందర పడుతున్నాను."

"బాగా ఆలోచించు సునా! తర్వాత విచారిస్తావు"

"లేదు జానీ! నిన్న రాత్రంతా ఆలోచించాను. నా ప్రశ్నలన్నిటికీ జవాబులు దొరికాయి. ప్రకాశంగారు అవుననాలే కాని... నాకీ జీవితంలో విచారించే ఘడియే రాదు."

"ఒక్క రోజులో ఎలా మారిపోయావు?"

"నిన్నటి సంఘటనలే నన్ను మార్చివేసాయి... నన్ను మర్యాద చేసిన వారు గదిలోకి వచ్చిన

ప్రకాశంగార్ని కూర్చోమని అననయినా లేదు. పైగా నా ఎదురుగా నేనాయన కొలీగ్ నన్న స్పృహ అయినా లేకుండా ఆయన్ని నానా మాటలూ అన్నారు. అటువంటి వ్యక్తిలో ఇంక అర్థం చేసుకొనే ఓర్పు. మంచి మనసు ఎక్కడుంటాయి? ఇంతకాలం నాకనిపించిన మంచి లక్షణాలన్నీ పైపై మెరుగులు. మత్తెక్కించే మాటలు అంతే! అదంతా పెళ్ళయ్యే వరకే! ఆ తర్వాత అసలు మనిషి బయటికి వస్తారు. అప్పుడు నన్నోదార్చటానికి కూడా నువ్వు దగ్గరకు రాలేవు.''

''ఏమో! నాకేం చెప్పాలో తెలియటంలేదు.''

''పూర్తిగా వింటే నీకే అర్థమవుతుంది జానీ! ఇన్నాళ్ళూ పెళ్లి చేసుకోమని ఆయన అడిగితే... సిగ్గుతో ఏం చెప్పాలో తెలియలేదు. ఇప్పుడు సిగ్గు విడిచి ప్రకాశంగార్నే అడగాలనిపిస్తోంది - నన్ను పెళ్లి చేసుకోండని!''

జానకి నిర్ఘాంతపోయింది.

''మళ్లీ ఆ పిల్లని చూడ్డానికి హాస్పిటలుకు వెడుతున్నాను. కావాలంటే వచ్చి నిజం తెల్సుకోండన్నారు ప్రకాశంగారు. ఆయ నిజాయితీని పరీక్షించటం కోస కాకపోయినా-పాపం. ఆ పిల్లవని చూడాలన్న మంచి హృదయ మనకి లేకపోయింది!''

జానకి కంగారుగా అంది

''వెళ్లిందే వాళ్ళం. కాని అప్పటికే చీకటి పడిందని...''

''లేదు జానీ! మన మనసుల్లో లేని మంచితనం మనకుందని చెప్పుకొని ఆత్మవంచన చేసుకోవద్దు... మనం అనుకోనూ లేదు. మాట వరసకి ఆయనతో వస్తామని అననూ లేదు.''

జానకి అవాక్కయిపోయింది.

''ప్రకాశంగారితో వెళ్లకపోయినా...తర్వాత ఆయన వెళ్లిన చోటుకే నేను వెళ్లాల్సి వచ్చింది నేవెళ్లేదాకా ఆయన అక్కడే ఉన్నారు!''

''ఎందుకు?'' జానకి ఆతృతగా అడిగింది.

సునంద కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. గొంతు వణికింది. తల దించుకుంటూ అంది.

''స్కూటరు క్రింద పడిన పిల్ల ఎవరో కాదు....మా చెల్లెలు!'' *

Published by K. Rajendra Babu, 80, Dhanalaxmi Colony, Madras-600 026., and Printed by Sri Vijaya Bapineedu at Vijaya Graphics, 8, Arcot Road, Madras-600 026. Phone: 421616
Editor: VIJAYA BAPINEEDU.